క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటన

గూడెంకొత్తవీధి: మండలంలోని లక్కవరపేట సచివాలయం పరిధిలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శనివారం పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ తెలిపారు. సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎర్రచెరువులు, కిన్నెర్లబంద, సంపంగిగొంది, పెదకొండ, నేరెళ్లబంద, గరికబంద, లింగవరం, పోతురాజుగున్నాల గ్రామాల్లో పర్యటిస్తారని, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కొయ్యూరు: రాజేంద్రంపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షురాలు అంబటి నూకాలు, సర్పంచ్ పిటీ సింహాచలం శుక్రవారం తెలిపారు. శిబిరాన్ని కాకినాడకు చెందిన అంజు కంటి ఆస్పత్రి యాజమాన్యం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిని అంతా సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు.

జాబ్‌కార్డుదారులకు పనులు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతయ్య

చింతపల్లిరూరల్: చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో లాలం సీతయ్య శుక్రవా రం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. భూమి చదును, బెంచ్ కటింగ్ పనులను పరిశీలించా రు. అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు.అనంతరం సామరవీధిలో నిర్మిస్తున్న రహదారిని పరిశీలించారు. సకాలంలో వేతనదారులకు నగదు చెల్లించాలని, పనుల లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కొయ్యూరు: డౌనూరు పంచాయతీ రొబ్బసింగి, ముల్లుమెట్ట గ్రామాల్లో యువతకు అల్లూరి గిరి యువసేవా సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ గిరి యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. దాతల సహకారంతో అందజేసినట్టు సంఘం నేత మల్లేశ్, డౌనూరు హాస్టల్ వార్డెన్ హరిదేవ్ తెలిపారు. సచివాలయ సంక్షేమ సహాయకులు చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. సంఘం ప్రతినిధులు చిరంజీవి, నన్ని తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్‌వోకు సన్మానం



ఎస్‌వో పార్వతిని సన్మానిస్తున్న ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

జి.మాడుగుల: మండల కేంద్రంలోని కెజీబీవీలో ఇంటర్‌లో అధిక పర్సంటేజ్ రావడంతో పాడేరులో శుక్రవారం కెజీబీవీ ప్రత్యేక అధికారి పార్వతిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర శాలువ కప్పి, బొకెను అందించి ఘనంగా సన్మానించారు. రానున్న విద్యా సంవత్సరంలో కెజీబీవీ మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. డిప్యూటీ డీఈవో చెల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: మండలంలోని జైపూర్ జంక్షన్ సమీపంలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, లేని పక్షంలో కేసులు తప్పవన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఘాట్‌రోడ్డులో ప్రమాదకరంగా ఎండిన చెట్లు
- వాహనచోదకుల ఆందోళన



లారీపై విరిగిపడిన భారీ చెట్టు



ములియగుడ సమీపంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఎండిన చెట్టు



డముకు సమీపంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఎండినచెట్టు

అనంతగిరి: మండలంలోని ఘాట్‌రోడ్డులోని ప్రయాణాలకు వాహనదారులు భయోందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ చెట్టు నెలకూలుతుందోనని, బితుకుబితుక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతవరణంలోని సాగే ప్రయాణం ప్రస్తుతం భయం భయంగా మారిదంటూ వాహనదారులు వాపోతున్నారు. ఘాట్‌రోడ్డు శివలింగపురం నుంచి అరకు వరకు ప్రధాన రహదారిలోని ప్రమాదభరితంగా ఉన్న చెట్లు తొలగించకపోవడంతో ప్రయాణాలు సాగిస్తున్న సమయంలోని వాహనాలపై ఆకస్మాత్తుగా చెట్లు విరిగిపడుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఆనుకుని పలు చెట్లు ఎండిపోయి ప్రమాదభరితంగా మారాయి. ఏ సమయంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించేందుకు ఎన్‌హెచ్‌– 516 శాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

లారీపై విరిగిపడి భారీ చెట్టు

అనంతగిరి మండల కేంద్రం పీహెచ్‌సీ సమీపంలోని ప్రధాన రహదారిలో అరకు నుంచి మైదాన ప్రాంతానికి వెళుతున్న లారీపై ఆకస్మాత్తుగా భారీ చెట్టు విరిగిపడడంతో లారీ అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టి, నిలిచిపోయింది. ఈ ప్రమాదంలోని డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. రక్షణగోడను ఢీకొట్టి లారీ ఆగకపోతే.. లారీ లోయలోకి దూసుకుపోయి, ప్రమాదం మరింతా దారుణంగా ఉండేదని, పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్516 శాఖ అధికారులు స్పందించి, ఘాట్‌రోడ్డు మొదలు కొని అరకు ప్రధాన రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న చెట్లను తొలగించాలని, వాహనచోదకులు కోరుతున్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: మండలంలో కోరాపల్లి, సింగర్భ గ్రామ సచివాలయాల్లో శుక్రవారం ఎంపీడీవో చంద్రశేఖరరావు సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో వాటర్ ట్యాంకుల క్లీనింగ్ షెడ్యూల్ రిజిష్టరు, పాఠశాల, వసతి గృహాల బడిమాని వేసిన పిల్లల వివరాలు, వ్యాక్సినేషన్, హైరిస్కు గర్భిణీలు మోనటరింగ్, రక్తహీనత పిల్లల వివరాల రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.ఉపాధి పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలని సూచించారు. ఎస్‌డీజీ సర్వే, కళ్యాణమస్తు ధ్రువీకరణ వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కోరాపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులపై ఆరా తీశారు. ఎంపీటీసీ, ఈవోపీఆర్డీ నాయుడు, సచివాల ఉద్యోగులు ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ గొడ్డుబూసులు గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో దేవాదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మ ప్రసార ప్రముఖ్ రీమెలి అప్పలరాజు, గ్రామస్తులు రామకృష్ణ, నాగమణి దంపతులు వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమి పూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణ పనులు త్వరలో చేపడతామని వారు చెప్పారు.ఈ ఆలయానికి టీటీడీ రూ.10లక్షలు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఎనిమిది గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: గ్రామాల స్థాయిలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ మండల వ్యాప్తంగా చేసిన ఉపాధి హామీ పనులపై శనివారం నుంచి సామాజిక తనిఖీ బృందాలు చేపడుతున్న పరిశీలనకు సహకరించాలని ఎంపీడీఓ కె.బాపన్నదొర అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ వి.కనకారావు, ఏపీవో మణికుమారి, ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఇంజినీర్లు, ఉపాధి హామీ విభాగం పనులతో అనుసంధానమైన వివిధ శాఖల సిబ్బంది తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సామాజిక తనిఖీ విధి విధానాలపై తగిన అవగాహన ఉండాలన్నారు. పనులు జరిగిన విధానం, వేతనదారుల వాదన, ప్రతిపాదనల్లో పేర్కొన్న అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి నివేధిక రూపొందిస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు షెడ్యూల్ ప్రకారం జరపాలని, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలని బృందాన్ని కోరుతున్నామన్నారు. రికార్డులు సమర్పించి దానికి అనుగుణంగా క్షేత్రస్థాయి పరిశీలనకు సిబ్బంది సహకరించాలని సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ వి.కనకారావు కోరారు.

ముమ్మరంగా భూ రీసర్వే



రీ సర్వే చేస్తున్న ఫారెస్టు, రెవెన్యూశాఖల సిబ్బంది, సర్వేయర్లు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ సూరిమెట్ట గ్రామంలో రీ సర్వే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. గత మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తున్నా ఫారెస్టు సిబ్బంది, సర్వేయర్లు భూ సర్వేను సాగిస్తున్నారు. బొయితిలి పంచాయతీలో సూరిమెట్ట, మొండిగెడ్డ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ, అటవీశాఖల అధ్వర్యంలో రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. నుర్మతి బీట్ అధికారి జి.ధనేశ్వరి, సచివాలయ సర్వేయర్ అజయ్, వీఆర్వో సంధ్య, ఎంపీటీసీ ఎల్.అప్పలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్ యార్డును తొలగించాలి



ఇసుక డంప్‌యార్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఎటపాక: మండలంలోని గుండాల గ్రామంలో ఉన్న ఇసుక డంపింగ్ యార్డును తొలగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ర్యాంపు నుంచి ఇసుకను తీసుకువచ్చి నివాస ప్రాంతాల్లో నిల్వ చేయడంతో స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఎస్‌ఐ పార్థసారధికి ఫిర్యాదు చేయటంతో ఆయన డంపింగ్ యార్డును పరిశీలించారు. లారీలు , ట్రాక్టర్లు తిరుగుతుండడంతో ప్రమాదాలు జరుగుతాయని, ఇసుక డంపింగ్ సమయంలో తీవ్రంగా దుమ్ము లేచి ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర కమలవర్తి వ్రతం



పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో సహస్ర కమలవర్తి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కమలవర్తి వ్రతంలో భాగంగా సంపూర్ణ ఆరోగ్యం, అష్టైశ్వర్యాలు, సిరిసంపదలు సిద్ధించాలని కోరుతూ విష్ణుమూర్తి, లక్ష్మీదేవిలకు పూజలు నిర్వహించినట్టు పురోహితులు చెప్పారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.

ధింసా కళాకారులకు చీరలు పంపిణీ



గాలిపాడులో ధింసా కళాకారులకు చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ అప్పారావు

అనంతగిరి: మండలంలోని మారుమూల గుమ్మకోట పంచాయతీ గిరిశిఖర గ్రామమైన గాలిపాడు గ్రామ గిరిజన ధింసా కళాకారులకు చీరలను సర్పంచ్ అప్పారావు శుక్రవారం అందజేశారు. గిరిజన సంస్కృతి సంప్రదాయమైన ధింసా నృత్యాలను మరింతగా రాణించాలని కోరారు. తన సహకారం ఉంటుందని, తన సొంత ఖర్చుతో కళాకారులను ప్రోత్సహిస్తూ, చీరలు అందజేసినట్టు తెలిపారు.

మాతా శిశు మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి



సమీక్షిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పక్కన ఈవోపీఆర్డీ పాపారావు

గూడెంకొత్తవీధి: మండల పరిషత్‌కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులతో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాతా శిశుమరణాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఇతర వైద్య సిబ్బంది, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. ప్రసవానికి ముందే గర్భిణులను ఆసుపత్రులకు తరలించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించాలని ఆదేశించారు. దేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియలను పూర్తిచేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ తప్పనిసరి



పిచికారీ పనులు పర్యవేక్షిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, వైద్య శాఖ అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో మొదట విడత మలేరియా దోమల నివారణ మందు పిచికారీని శుక్రవారం వైద్య శాఖ అధికారులు చేయించారు. పిచికారీని వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఎంపీడీవో రమేష్‌లు పర్యవేక్షించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజనులంతా వైద్య సిబ్బందికి సహకరించి, ఇళ్ల లోపల కచ్చితంగా పిచికారీ చేసుకోవాలని, మలేరియా జ్వరాల బారిన పడకుండా ఉండాలని, వైద్యశాఖ అధికారుల ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరారు. మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ అశోక్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, వార్డు మెంబర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

హరివిల్లు కనువిందు



మండల కేంద్రంలో శుక్రవారం హరివిల్లు కనువిందు చేసింది. మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపం కనిపించిన చింతపల్లిలో ఉన్నట్టుండి వాతావరణం ఒక్కసారిగా భిన్నంగా మారింది. కారుమబ్బులు కమ్ముకున్నాయి. చల్లగాలి వీచింది. వర్షం కురుసింది. వాన వెలిసిన తరువాత సమీపంలో కొండపై రంగుల హరివిల్లు కొద్దిసేపు కనువిందు చేసింది. - చింతపల్లి రూరల్

ఘనంగా దేవతమ్మ పుట్టుక మహోత్సవం



ఊరేగింపులో భక్తులు

కశింకోట : స్థానిక గవరపేట దేవతమ్మ పుట్టుక మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయం నుంచి శారదానది అవతల పొలాల్లో ఉన్న అమ్మవారి పుట్ట వద్దకు జముకుల డప్పులు, బాణసంచాతో ఊరేగింపుగా వెళ్లారు. ప్రధానంగా వేగి ఇంటి పేరున్న వారు పట్ట వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాన్ని సంప్రదాయంగా బుట్టలో ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆలయంలో నిలిపారు.

ఈ సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. స్థానిక కొత్తవీధిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా ఆలయం వద్ద పూజలు, హోమాలు నిర్వహించి శుక్రవారం స్వామివారి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో విశ్వబ్రాహ్మణులు, స్థానికులు, ప్రజాప్రతినిధులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం వరకు ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పాల్గొని కనులారా వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంతం ఆదినారాయణ, ఆరిపాక శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగునా?

- శిథిలావస్థలో గ్రంథాలయ భవనం
- వర్షాలకు తడిసిపోతున్న విలువైన పుస్తకాలు




శిథిల భవనంలో గ్రంథాలయం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకొంది. గోడలు బీటలు వారి, వర్షాలు కురిసినపుడు నీరు కారుతుండడంతో గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు తడిసి ముద్దయి పాడై పోతున్నాయి. పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రంథాలయనికి శాశ్వత భవనం లేదు. ప్రస్తుతం ఐటీడీఏ క్వార్టర్స్‌లోని అద్దె భవనంలో గడిచిన 15 సంవత్సరాలుగా గ్రంథాలయ నిర్వహణ కొనసాగుతోంది. ఈ భవనం సైతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం గ్రంథాలయనికి భవన సమస్య నెలకొంది. భవన నిర్మాణానికి కావల్సిన నిధుల కోసం ఉన్నతాధికారులకు మండల శాఖ గ్రంథాలయం నిర్వహణ అధికారులు ప్రతిపాదనలు అనేక మార్లు పంపినప్పటికీ నేటికి మంజూరు కాలేదని పలువురు చెబుతున్నారు. భవన నిర్మాణానికి కావల్సిన స్థలాన్ని మాత్రం రెవెన్యూశాఖ అధికారులు కేటాయించారు. వర్షాకాలంలో గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు, పేపర్లు కాపాడుకోవటానికి సిబ్బంది, అధికారులు నానా అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు, పాఠకులు కోరుతున్నారు. ఈ విషయంపై లైబ్రేరియన్ ఓ.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయానికి నూతన భవనం కోసం ఉన్నతస్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. భవన నిర్మాణానికి స్థలం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రస్తుతానికి పుస్తకాలు, పేపర్లు పాడవకుండా చూస్తున్నామన్నారు.

కనులపండువగా పైడితల్లి ఘటం ఊరేగింపు

ఎస్.రాయవరం : మండలంలోని కొరుప్రోలు శ్రీ పైడితల్లి అమ్మవారి ఘటాల ఊరేగింపు గ్రామంలో ఘనంగా జరిగింది. పల్లె కులస్తుల అరాధ్య దైవం పైడితల్లి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల్లోకి వచ్చిన అమ్మవారి ఘటాన్ని దర్శించుకునేందుకు పోటీపడ్డారు. ఘటాన్ని తాకుతూ పసుపు కుంకమలు స్వీకరించారు. ఘటంలో అమ్మవారికి బియ్యం, పండ్లు కానులు వేశారు. డప్పులమేళాల మధ్య అమ్మవారి ఘటం ఊరేగింపుతో గ్రామంలో సందడి నెలకొంది. వారం రోజులపాటు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి 9న అమ్మవారికి ఘనంగా జాతర చేయనున్నట్టు ఉత్సవ కమిటీ వెల్లడించింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశంలో నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరిసీతారామరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–20 విద్యా సంవత్సరంలో చదువుకున్న టెన్త్ బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో సందడి చేశారు. ఎక్కడెక్కడో నివసిస్తున్న వారంతా సుమారు 22 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై కలుసుకొని ఆత్మీయంగా ఒకరికొకరు పలుకరించుకొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకొన్నారు. అప్పట్లో చదువు చెప్పిన తేజోమూర్తుల వెంకటేశ్వరశర్మ దంపతులు, బీ.ఎస్.కుమార్ దంపతులు, బాబూరావు, అప్పారావులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. సుమారు 70 మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట

యలమంచిలి : మండలంలో పీఎస్‌ఆర్ పేట, పేటబయ్యవరం జంట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో శక్రవారం దుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని వేద మంత్రోచ్ఛారణతో అత్యంత వైభవంగా ప్రతిష్టించారు. గత మూడు రోజులుగా అమ్మవారి ఆలయం వద్ద కుంకుమ పూజలు, యజ్ఞ హోమాలు జరిపి అమ్మవారి నూతన ఉత్సవ విగ్రహం, గరగలు, అమ్మవారి పాదాలు, వివిధ శివపార్వతుల విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరతనాట్యం, కోలాటం, చిటికల భజన విశేషంగా ఆకట్టుకున్నాయి. సర్పంచ్‌లు శివ, సత్యనారాయణ, నాయకులు శేఖర్, గోవిందరావు, ఉత్సవ కమిటీ సభ్యులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.